మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర సంపుటి : 08 సంచిక : 168 ఆదివారం 14 - 12 - 2025 పేజీలు: 8 వెల: 4

## వాజ్ పేయీ స్ఫూర్తితో... మోడీ పాలన !



3లో..

- ☐ కూటమి ప్రభుత్వంలో దేవాలయాలకు పూర్వ వైభవం
- ☐ 1058 ఆలయాల పునర్నిర్మాణానికి రూ.846 కోట్లు
- ☐ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



# రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపడమే లక్ష్యం

మనగళం, కర్నూలు సిటీ : అభివృద్ధి,సంక్షేమం, పారిశ్రామికం, ఆధ్యాత్మికం అన్నింటిలో రాష్ట్రాన్ని అగ్రగామి గా ఉంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. కర్నూలు నగరంలో రూ. 4.25 కోట్ల వ్యయంతో నిర్మించిన దేవాదాయ శాఖ కర్నూలు జోన్ పరిపాలనా కార్యాలయ భవన సముదాయాన్ని శనివారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ఆనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయ శాఖ హెడ్ ఆఫీస్ విజయవాడలో గొల్లపూడిలో ఉన్నట్లు గానే, రాయల సీమకు కర్నూలులో ఈ ఆధ్యాత్మిక భవనం ఏర్పాటు చేయడం అత్యంత సంతోషదాయకం అని పేర్కొన్నారు. ఈ కార్యాలయ సముదాయంలో డిప్యూటీ కమిషనర్ కార్యాలయం తో పాటు ఇంజనీరింగ్ తదితర కార్యాలయాలు కూడా ఉన్నాయని, నూతన కార్యాలయం కర్నూలు నుండి కాణిపాకం వరకు పనిచేస్తుందన్నారు. ఆలయాల్లో పూజా కైంకర్యాలు, ఉత్సవాలు ఆగమ శాస్త్ర పండితులు, వేద పండితుల నిర్ణయాలు మేరకే జరుగుతాయన్నారు. పురాతన ఆలయాలు, వాటి కట్టడాలను సంరక్షించే విధంగా ఈ శాఖ పని చేస్తుందని మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన హామీల్లో దేవాదాయ శాఖలో 98 శాతం నెరవేర్చాం అని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు 2372 మంది అర్చకులకు కనీస వేతనం కింద ప్రతి నెల రూ.15వేలు ఇస్తున్నామన్నారు. వేద విద్య నేర్చుకున్న 599 మంది అర్హులైన వేద పండితులకు సంభావన కింద నెలకు రూ.3 వేలు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఆలయాల్లో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ. 25 వేల చొప్పున వేతనం ఇస్తున్న ప్రభుత్వం తమది అని మంత్రి పేర్కొన్నారు. ఆలయాల ట్రస్ట్ బోర్డులో పాలకవర్గంలో బ్రాహ్మణుల్లో ఒకరిని,

2 లో..



## ఢిల్లీలో తీవ్ర వాయు కాలుష్యం..

- అమల్లోకి స్టేజ్-3 ఆంక్షలు
- డేంజర్ బెల్స్ మోగుతున్న గాలి నాణ్యత
- జీఆర్ఏపీ స్టేజ్-3 అమలు.. కఠిన ఆంక్షలు
- పొగమంచుతో దృశ్యమానత తగ్గింపు

మన గళం, న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. గాలి నాణ్యత రోజురోజుకూ మరింత క్షీణిస్తోంది. శనివారం ఉదయం ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో 18 మానిటరింగ్ స్టేషన్లలో ఏక్యూఐ స్థాయిలు 400కు పైగానే నమోదయ్యాయి. మొత్తం ఢిల్లీ నగర ఓవరాల్ ఏక్యూఐ 387గా ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పరిస్థితి మరింత దిగజారకుండా ఉండేందుకు కఠిన చర్యలు చేపట్టారు. తీవ్ర కాలుష్యం నేపథ్యంలో ఢిల్లీ-ఎన్సీఆర్‌లో జీఆర్ఏపీ స్టేజ్-3

2 లో..

## గ్రామస్థుల నుంచి డబ్బులు వసూలు చేసిన సర్పంచ్ అభ్యర్థి



మన గళం, హైదరాబాద్ : తెలంగాణలో పంచాయతీ ఎన్నికల వేడి ఇంకా చల్లారకముందే నల్గొండ జిల్లాలో ఒక విచిత్ర ఘటన చోటు చేసుకుంది. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఓ అభ్యర్థి, ఎన్నికల ముందు గ్రామస్థులకు ఇచ్చిన డబ్బులను తిరిగి వసూలు చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నార్కట్‌పల్లి మండలం ఔరవాని గ్రామంలో ఈ ఘటన జరిగింది. ఔరవాని గ్రామానికి చెందిన కల్లూరి

2 లో..



## కొన్ని గంటల్లోనే నిధులు మంజూరు

- దీపిక విజ్ఞప్తికి ఉప ముఖ్యమంత్రి తక్షణ స్పందన
- తంబలహెట్టి గ్రామానికి రూ.6.2 కోట్ల రోడ్ల మంజూరు

మన గళం, మడకశిర : భారత అంధుల మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక చేసిన ఒక విజ్ఞప్తికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గంటల వ్యవధిలోనే స్పందించారు. తమ ఊరికి సరైన

2 లో..


## డిజిటల్ పైరసీ పెరుగుదల వెనుక అసలు కారణాలేమిటి?

- యువతే నిందితులా? వ్యవస్థ లోపాలా?
- అధిక టికెట్ ధరలు, ఖరీదైన సబ్‌స్క్రిప్షన్లు కారణమా?
- నైతిక బాధ్యతతో పాటు అందుబాటు అవసరమన్న వాదన



మన గళం డెస్క్ : డిజిటల్ పైరసీ కేసులు దేశవ్యాప్తంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ సమస్యపై కొత్త చర్చ మొదలైంది. సినిమాలు, వెబ్ సిరీస్‌లు విడుదలైన కొద్ది గంటల్లోనే పైరసీ వెబ్‌సైట్లలో దర్శనమివ్వడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితికి యువతే పూర్తిగా బాధ్యత వహించాలా? లేక వారిని ఆ దిశగా నడిపిస్తున్న పరిస్థితులే అసలు కారణమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మల్టీప్లెక్స్‌లలో టికెట్ ధరలు సామాన్యుడి అందుబాటును మించి పెరగడం, స్నాక్స్ పేరుతో అధిక వసూళ్లు చేయడం, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల సబ్‌స్క్రిప్షన్ ఖర్చులు భారంగా మారడం వల్ల వినోదం ఖరీదైనదిగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో ఉచితంగా లభిస్తున్న పైరసీ కంటెంట్ వైపు యువత ఆకర్షితులవుతున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, పైరసీని కట్టడి

2 లో..




## విద్యతో పాటు విలువలు ముఖ్యం

- మంత్రి లోకేశ్‌డాన్ బాస్కో స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న విద్యాశాఖ మంత్రి




మన గళం, మంగళగిరి : విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, మానవతా విలువలు కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. తాను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి ప్రధాన కారణం తన ఉపాధ్యాయులేనని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలోని డాన్ బాస్కో ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలకు లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్వర్ణోత్సవ శిలాఫలకాన్ని,

2 లో..

## కానిస్టేబుల్ నియామక పత్రాల పంపిణీకి సర్వం సిద్ధం

- ఈ నెల 16న మంగళగిరిలో కార్యక్రమం
- ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు
- ఏర్పాట్లను పరిశీలించిన హోంమంత్రి అనిత



మన గళం, మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతనంగా ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈ నెల 16వ తేదీన నియామక పత్రాలు అందజేయనున్నారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్

2 లో..

## ఢిల్లీలో తీవ్ర వాయు కాలుష్యం..



ఆంక్షలను అమలు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అనవసర నిర్మాణాలు, కూల్చివేత పనులు, రాత్రివేళ క్రషింగ్, మైనింగ్ కార్యకలాపాలపై నిషేధం విధించారు. డీజిల్‌తో నడిచే పాత వాహనాలకు ఢిల్లీలోకి ప్రవేశం నిరోధించారు. కార్యాలయాలు 50 శాతం సిబ్బందితో మాత్రమే పనిచేయాలని సూచించగా, విద్యాసంస్థలు హైబ్రిడ్ విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఐదో తరగతి వరకు విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని సూచించింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు గణాంకాల ప్రకారం వజీర్‌పూర్‌లో అత్యధికంగా 443 ఏక్యూఐ నమోదైంది. జహంగీర్‌పురి, వివేక్ విహార్, రోహిణి, ఆనంద్ విహార్, అశోక్ విహార్ వంటి అనేక ప్రాంతాల్లోనూ కాలుష్య స్థాయిలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎన్సీఆర్ పరిధిలోని ఘజియాబాద్, నోయిడాల్లో కూడా ఏక్యూఐ 422గా నమోదైంది. కాలుష్య ప్రభావంతో పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలుష్యానికి తోడు దట్టమైన పొగమంచు నగరాన్ని కమ్మేయడంతో దృశ్యమానత గణనీయంగా తగ్గింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ విమానాశ్రయం ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోనూ పొగమంచు పరిస్థితులు నెలకొన్నాయి. వాయు నాణ్యత ప్రమాణాల ప్రకారం 401 నుంచి 500 మధ్య ఏక్యూఐ ఉంటే ప్రమాదకర స్థాయిగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఢిల్లీ ఆ స్థాయికి చేరువలో ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపడమే లక్ష్యం





నాయీ బ్రాహ్మణుల్లో ఒకరిని సభ్యులుగా చేర్చేందుకు చట్టం తెచ్చామన్నారు. రాష్ట్రంలో ఉన్న పెద్ద పెద్ద ఆలయాలన్నింటిని టూరిజం సర్క్యూట్ కింద చేర్చి, టెంపుల్ టూరిజంను రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 21 ఆలయాల్లో ప్రతినిత్యం అన్నప్రసాద వితరణ జరుగుతోందని, 74 ఆలయాల్లో వారానికి ఒకరోజు, రెండు రోజులు అన్నప్రసాద వితరణ చేస్తున్నామని మంత్రి తెలిపారు. 11 ఆలయాల్లో రాష్ట్ర పండుగలు నిర్వహిస్తున్నామని, ఇందులో వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాన్ని చేర్చి రాష్ట్ర పండుగలు నిర్వహిస్తున్నామన్నారు. 20 ఆలయాల్లో 3700 గోవులను సంరక్షిస్తున్నామని, మూడు వేద పాఠశాలలు, ఏడు ఆగమ పాఠశాలల్లో 400 మంది విద్యార్థులకు వేదం నేర్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ధూపదీప నైవేద్యం కింద 2021 నుండి రూ.5వేల నుండి 10 వేలకు పెంచి రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నామని, 5821 ఆలయాల్లో ప్రతినెల రూ.10 వేల చొప్పున పూజారి అకౌంట్లో ఈ మొత్తాన్ని జమ చేస్తున్నామని మంత్రి వివరించారు. పురాతన ఆలయాల పునర్నిర్మాణం కోసం కామన్ కింద నిధులను మంజూరు చేసి పనులను చేపట్టడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో 1058 ఆలయాలలో పునర్నిర్మాణ పనులు, గతంలో ఆపేసిన పనులన్నింటికీ రూ. 846 కోట్లు నిధులు మంజూరు చేశామని, ఒకటి, రెండు ఏళ్లలో ఈ పనులన్నీ పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యం లో దేవాలయాలకు పూర్వ వైభవం వస్తోందని మంత్రి తెలిపారు. కర్నూలు జిల్లాలో 153 ఆలయాల్లో ధూప దీప నైవేద్యాల కోసం రూ.18.36 కోట్లు, ఆలయాల పునర్నిర్మాణ పనుల కోసం రూ.14 కోట్లు, నంద్యాల జిల్లాలో 39 ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు రూ. 37.8 కోట్లు, ఆలయాల పునర్నిర్మాణం కోసం రూ.50.12 కోట్లు, అనంతపురం జిల్లాలో ధూపదీప నైవేద్యాల కోసం 58.32 కోట్లు, ఆలయాల పునర్నిర్మాణం కోసం రూ. 26.40 కోట్లు మంజూరు చేయడం జరిగిందని మంత్రి వివరించారు. ఘనంగా గోదావరి, కృష్ణా పుష్కరాలు: రాష్ట్రంలో గోదావరి కృష్ణ పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని మంత్రి ఆనం తెలిపారు. 2027 జూన్ 26 నుంచి జూలై ఏడవ తేదీ వరకు 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు ఆగమ పండితులు, వేద పండితులు తేదీలను నిర్ణయించడం జరిగిందని, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి.. పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. త్వరలో ఈ అంశంపై చీఫ్ సెక్రటరీ, ఇతర శాఖల కార్యదర్శిలు హెచ్‌ఓడీలతో సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. పుష్కరాల నిర్వహణ లో భాగంగా కోనసీమ, తూర్పుగోదావరి పశ్చిమగోదావరి తదితర ప్రాంతాల్లోని 31 ఆలయాల్లో పనులు మంజూరు చేశామని, వీటిని మొదలుపెట్టడం జరుగుతుందన్నారు. 2028 లో కృష్ణా నది పుష్కరాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో గోదావరి పుష్కరాలు, కృష్ణా పుష్కరాలు ఘనంగా జరిగాయని, అదే విధంగా ఈ సారి కూడా పుష్కరాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

## గ్రామస్థుల నుంచి డబ్బులు వసూలు చేసిన సర్పంచ్ అభ్యర్థి

బాలరాజు బీఆర్ఎస్ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచాడు. కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేసిన జక్కల పరమేశ్‌తో ప్రధాన పోటీ నెలకొంది. రెండు రోజుల క్రితం జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో పరమేశ్, బాలరాజుపై సుమారు 450 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించాడు. ఈ ఎన్నికల్లో బాలరాజు దాదాపు రూ.10 లక్షల వరకు ఖర్చు చేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఓటమి తేడా ఎక్కువగా ఉండటంతో తీవ్ర నిరాశకు గురైన బాలరాజు, తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన డబ్బులు తిరిగి తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు అతని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయి ఉంటే వదిలేసేవాళ్లమని, కానీ భారీ ఆధిక్యంతో ఓటమి రావడంతో ఇలా చేయాల్సి వచ్చిందని వారు వ్యాఖ్యానించారు. బాలరాజు ఒక చేతిలో దేవుడి ఫొటో పట్టుకుని గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ, తనకు ఓటు వేసినవారు దేవుడిపై ప్రమాణం చేసి చెప్పాలని, లేదంటే ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఈ విధంగా పలువురు గ్రామస్థుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న ఈ సంఘటన గ్రామ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది.

# కొన్ని గంటల్లోనే నిధులు మంజూరు

రోడ్డు సౌకర్యం లేదని దీపిక చెప్పిన వెంటనే, ఆమె స్వగ్రామానికి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వ పరిపాలనలో వేగాన్ని చూపించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణ చర్యలు చేపట్టడంతో ఈ ఘటన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం హేమావతి పంచాయతీ పరిధిలోని తంబలహెట్టి గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక గ్రామస్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దీపిక ఇటీవల ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి వెళ్లే దారులు అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు నిత్య అవసరాలకూ ఇబ్బందులు పడుతున్నారని ఆమె వివరించారు. దీపిక మాటలను గమనించిన పవన్ కల్యాణ్ అక్కడికక్కడే రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు.ఆ హామీ ఇచ్చిన కొద్ది గంటల్లోనే అధికారులను రంగంలోకి దింపిన ఉప ముఖ్యమంత్రి, రోడ్ల పరిశీలన, అంచనాల తయారీకి ఆదేశాలు జారీ చేశారు. హేమావతి నుంచి తంబలహెట్టి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.3.2 కోట్లు, గున్నేహళ్లి నుంచి తంబలహెట్టి వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డుకు రూ.3 కోట్లు అవసరమని అధికారులు నివేదిక సమర్పించారు. ఈ నివేదికలకు వెంటనే ఆమోదం తెలిపిన పవన్ కల్యాణ్, మొత్తం రూ.6.2 కోట్ల నిధులను మంజూరు చేశారు. అడిగిన వెంటనే హామీ ఇవ్వడమే కాకుండా, గంటల వ్యవధిలోనే నిధులు మంజూరు చేయడంపై తంబలహెట్టి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీపిక విజ్ఞప్తితో గ్రామానికి మౌలిక సదుపాయం కలగనుండటంతో ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## గాజులదీన్నే ప్రాజెక్ట్ చైర్మెన్ కే ఇ మల్లికార్జున పరామర్శించిన కోడుమూరు ఎమ్మెల్యే

మన గళం కోడుమూరు: కోడుమూరు నియోజకవర్గం కోడుమూరు టౌన్ కి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మరియు గాజుల దీన్నే ప్రాజెక్ట్ ఛైర్మెన్ కే ఇ మల్లికార్జున గౌడ్ బ్రెయిన్ స్టోక్ రావడం వల్ల కర్నూలు మెడికవర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాస్పిటల్ కి వెళ్లి వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు

# విద్యతో పాటు విలువలు ముఖ్యం

నూతన సైన్స్ ల్యాబ్‌ను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ డాన్ బాస్కో సంస్థ సేవా భావానికి ప్రతీకగా నిలుస్తోందని ప్రశంసించారు. అనాథలకు అండగా నిలవడం, ఇల్లు లేని వారికి ఆశ్రయం కల్పించడం, ఆకలితో ఉన్నవారికి భోజనం అందించడం వంటి సేవలు ఈ సంస్థ ప్రత్యేకతగా ఆయన పేర్కొన్నారు. గత 50 ఏళ్లుగా దివ్యాంగులకు అండగా నిలుస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్న డాన్ బాస్కో వ్యవస్థను లోకేశ్ కొనియాడారు. తెలుగు రాష్ట్రాల్లో సుమారు 35 పాఠశాలల ద్వారా విద్యతో పాటు విలువలను అందిస్తున్న సంస్థగా దీనికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. విద్యార్థులు జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి చేరుకున్నా, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, చదివిన పాఠశాలను ఎప్పటికీ మర్చిపోవద్దని సూచించారు. పాఠశాల ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించిన లోకేశ్, ఎయిడెడ్ వ్యవస్థ రద్దు వల్ల ఏర్పడిన ఇబ్బందులను ప్రస్తావించారు. విద్యాశాఖ మంత్రిగా డాన్ బాస్కో పాఠశాలకు అన్ని విధాలా సహకరిస్తానని, సమస్యల పరిష్కార బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి డాన్ బాస్కోను దేశంలోనే అద్భుతమైన విద్యాసంస్థగా తీర్చిదిద్దుదామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రగతి వ్యవసాయ కార్మికులతోనే సాధ్యం

మన గళం కోడుమూరు: దేశంలో ప్రతి గ్రామం నేడు పురోగతి సాధించిందంటే గ్రామీణ ఉపాధి హామీ పథకం తోనే సాధ్యమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నభీ రసూల్ అన్నారు. శనివారం కోడుమూరు పట్టణంలో ని హమాలీ కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం కొళాయిల రాముడు అధ్యక్షులుగా జరిగింది. ఈ సమావేశానికి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నభిరసూల్, సిపిఐ నాయకులు రాజు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గం కార్యదర్శి శేషుకుమార్ లు ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనైనా చూపండి – జైల్లోనైనా పెట్టండి అనే నినాదంతో ఎన్నో ఏళ్లుగా ఏపీ వ్యవసాయ కార్మికసంఘం, సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేసి ప్రాణాలు కోల్పోయి, జైల్లాలో మగ్గిన వ్యవసాయ కార్మికులకు 2004 లో యు పి ఏ ఆధ్వర్యంలో 64 మంది వామపక్ష భావాలు గలవారిని దేశ ప్రజలు పార్లమెంట్ కు పంపారాని అటువంటి సందర్భంలో యు పి ఐ చైర్ పర్సన్ సోనియగాంధీ వామపక్ష పార్టీ లకు అధికారం కట్టబెట్టాలని చూశారు. కేవలం 64 మంది పార్లమెంట్ సభ్యులతో అధికారదాహం మనకు వొద్దని నాటి వామపక్ష పార్టీల కేంద్ర కమిటీ నిర్ణయం తీసుకొందని అన్నారు. యు పి ఏ ప్రభుత్వంతో వామపక్షలు నాడు అధికారం పంచుకోవడంతోనే నేడు దేశములో ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. ఈ చట్టాల కారణంగా నేడు దేశంలో ప్రతి గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు అవుతుందాన్నారు. దేశంలోని ప్రతి గ్రామంలో ని కార్మికులకు పని చూపించడం, పనికి తగ్గ వేతనం అందించాలనే ప్రధాన మైన డిమాండ్స్ కారణంగా నేడుదేశంలోని ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం అమలు అయ్యిందని అన్నారు. ఈ పథకాన్ని 100 రోజులనుండి 200 రోజులకు పెంచాలని, ప్రతి ఉపాధి కార్మికునికి రోజుకు రు 600 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

## కానిస్టేబుల్ నియామక పత్రాల పంపిణీకి సర్వం సిద్ధం

పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులకు ఇది ఒక స్మరణీయ ఘట్టంగా నిలవనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను హోంమంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. డీఐజీ ఏసుబాబు, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, బెటాలియన్ కమాండెంట్ నగేష్ బాబులతో కలిసి పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించి, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమం ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని హోంమంత్రి తెలిపారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఈ నియామకాలు కీలకమని అధికారులు పేర్కొన్నారు. కొత్తగా విధుల్లోకి వచ్చే కానిస్టేబుళ్లు క్రమశిక్షణతో, ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని కార్యక్రమం ద్వారా స్పష్టమైన సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు.

## డిజిటల్ పైరసీ పెరుగుదల వెనుక అసలు కారణాలేమిటి?



చేయడానికి అరెస్టులు, వెబ్‌సైట్ బ్లాకింగ్‌లు జరుగుతున్నప్పటికీ సమస్య పూర్తిగా తగ్గడం లేదు. సినిమా విడుదలైన రోజే లీక్ అవుతున్న కంటెంట్ వ్యవస్థలో భద్రతా లోపాలు ఉన్నాయనే అనుమానాలకు దారితీస్తోంది. కేవలం వినియోగదారులపై చర్యలే కాకుండా, పరిశ్రమలోని అంతర్గత లోపాలపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. పైరసీ నేరమే అయినప్పటికీ, దీనికి దారితీస్తున్న ఆర్థిక, సామాజిక పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్న వాదన వినిపిస్తోంది. యువతలో నైతిక బాధ్యత పెంచడంతో పాటు, వినోదాన్ని అందుబాటులోకి తీసుకువచ్చే విధానాలు అమలు చేస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# వాజ్ పేయీ స్ఫూర్తితో... మోడీ పాలన !

## - దేశం కోసం జీవితాన్ని అర్పించిన వాజ్ పేయీ- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్





మనగళం, కర్నూలు సిటీ : దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయీ స్ఫూర్తితో ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ పాలన సాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఆటల్ మోదీ సుపరిపాలన బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం సాయంత్రం ధర్నా చౌక్ లో దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయీ విగ్రహాన్ని ప్రారంభించారు. అనంతరం రాత్రి కర్నూలు మున్సిపల్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ బాబు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఏ.పీ.ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర, రాజంపేట పార్లమెంట్ ఇన్ ఛార్జ్, బీజేపీ సీనియర్ నేత చంద్రమౌళి, బీజేపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామక్రిష్ణ తదితరులతో కలిసి పీవీఎన్ మాధవ్ ర్యాలీగా బహిరంగ సభకు వెళ్లారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ సామాన్య వ్యక్తిగా వాజ్ పేయీ జీవితం మొత్తం ఎంతో కష్టంగా సాగిందని, అంకితభావంతో సేవలందించి ప్రధానిగా ఎదిగారని చెప్పారు. 1953లో పార్లమెంటులో వాజ్ పాయ్ అడుగు పెట్టిన సమయంలోనే భావిభారత ప్రధాని అవుతాడని సాక్షాత్తూ నెహ్రూ అన్నారని గుర్తు చేశారు. అటల్ ప్రసంగంలో ఎంతో ఉత్తేజం ఉంటుందని, పార్లమెంటు మొత్తం ఆసక్తిగా వింటూ ఉండేదన్నారు. తన జీవితాన్ని దేశం కోసం అర్పించాలని వాజ్ పాయ్ ఆనాడే నిర్ణయం తీసుకున్నారని, జన సంఘ్ కు పూర్తి కాలం పని చేసి దేశం మొత్తం పర్యటించారని వివరించారు. నరేంద్ర మోడీ ప్రధానిగా ఉన్నారన్నా... 20 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందంటే.. గతంలో వాజ్ పేయీ చేసిన కృషి ఎంతో ఉందని కొనియాడారు. వాజ్ పేయీ, మోడీకి ఎంతో సారూప్యత ఉందని...ఇద్దరూ పేదరికంలోనే పుట్టారని.... కృషి, పట్టుదల, క్రమశిక్షణతో కష్టపడి ప్రధాని స్థాయికి ఎదిగారని వివరించారు. శ్యాంప్రకాష్ ముఖర్జీ బలిదానం అయ్యారు.. విషయాన్ని గుర్తు పెట్టుకుని కాశ్మీర్ కోసం పోరాటం చేశారన్నారు. ఆనాడు జనరల్ సెక్రటరీగా ఉండి.. తప్పకుండా బీజేపీ ప్రభుత్వంలో 370 అధీకరణ రద్దు చేస్తామని శపథం చేశారన్నారు. అన్న విధంగానే మోడీ ప్రధానిగా 370 అధీకరణను రద్దు చేసి, కాశ్మీర్ ను భారతదేశంలో విలీనం చేశారని గుర్తు చేశారు. వాజ్ పాయ్ కన్న కలలను సాకారం చేసిన నేత నరేంద్ర మోడీ అన్నారు. భారతదేశం వద్ద అణుబాంబు ఉంటే ఎవరూ దాడి చేసే సాహసం చేయరని వాజ్ పాయ్ భావించారని, రెండోసారిప్రధాని అయిన తర్వాత అణపరీక్షల ద్వారా దేశం సత్తా చాటారని కొనయాడారు. ఉగ్రవాదులు ఒకటికి రెండు సార్లు ఆలోచన చేసే స్థితికి తెచ్చారు చెప్పారు. పార్లమెంటుపై దాడి చేస్తే ఆపరేషన్ పరాక్రమ్ పేరుతో వాజ్ పేయీ ప్రతీకారం తీసుకున్నారన్నారు. అదే విధంగా మోడీ కూడా ఆపరేషన్ సింధూర్ ద్వారా పాకిస్తాన్ ఉగ్రవాదులను తరిమికొట్టారని చెప్పారు. గ్రామాలలో రోడ్లు, రాష్ట్రాలను కలుపుతూ జాతీయ రహదారుల నిర్మాణానికి వాజ్ పేయీ శ్రీకారం చుట్టారని తెలిపారు. సర్వశిక్ష అభియాన్ కింద పేదలకు ఉచిత విద్య ను అందించే కార్యక్రమం శ్రీకారం చుట్టారన్నారు. ఉజ్వల గ్యాస్ పథకంతో అందరికీ గ్యాస్ సిలిండర్లు అందించారన్నారు. ప్రతి వ్యక్తికి సురక్ష, భద్రత ఉండేలా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. వాజ్ పేయీ స్ఫూర్తితో ప్రధాని మోడీ అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. వాజ్ పేయీ దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ యాత్ర చేపట్టామని, ప్రతి జిల్లాలో ఆయన విగ్రహం ఏర్పాటు చేసుకుని స్మరించుకుందాం అన్నారు. డిసెంబర్ 25 వాజ్ పేయీ జయంతి సందర్భంగా అమరావతిలో జరిగే బహిరంగ సభకు సీఎం చంద్రబాబు హాజరవుతారని, ఆయన దేశానికి చేసిన సేవలను నేటి తరానికి చాటి చెబుతామని పేర్కొన్నారు. కూటమి పార్టీల నేతలంతా కలిసి సమష్టిగా సభలు, యాత్రలు నిర్వహించాలని కోరారు. కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందన్నారు. ప్రజలు మళ్లీ మళ్లీ కూటమికి పట్టం కట్టాని, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు.






## టాటా ఎలక్ట్రానిక్ లో ఎంపికైన నేషనల్ విద్యార్థులు



మనగళం నంద్యాల నేషనల్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న 45 మంది విద్యార్థినులు తమిళనాడులోని హోసూర్‌లో ఉన్న టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఉపాధి పొందటానికి ఎంపికయ్యారని నేషనల్ విద్యాసంస్థల అధినేత డా. ఎస్. ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 2025–2026 సంవత్సరానికి చెందిన బి.సి.ఏ., బి.యస్.సి., బి.కామ్. ఫైనల్ ఇయర్ విద్యార్థినులు నెలకు రూ 20 వేల వేతనంతో ఈ కంపెనీలో చేరనున్నారని చెప్పారు. ఆపిల్ ఐఫోన్‌ల తయారీలో ఈ కంపెనీ ముఖ్యపాత్ర వహిస్తోందని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు కంపెనీ భోజనం, వసతి, క్యాబ్ సౌకర్యాలను కల్పిస్తుంది. ఈరోజు సాయంత్రం ప్రత్యేక బస్సులో విద్యార్థినులను హోసూర్‌కు విద్యార్థులకు డిగ్రీ పట్టాతోపాటు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా వివిధ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంటున్నామని డా. అహ్మద్ పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి. వేణుగోపాల్ పాల్గొన్నారు.

## ఘనంగా మంద అఖిల్ జన్మదిన వేడుకలు




మనగళం, కర్నూలు సిటీ : టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో ఐటిడిపి కర్నూలు నియోజకవర్గం అధ్యక్షుడు మంద అఖిల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూరు జేమ్స్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, టీడీపీ నాయకులు పుల్లయ్య చౌదరి, బజారన్న, చలపతి, జలీల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సెలవు రోజుల్లో సైతం పన్ను చెల్లింపులు

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరపాలక కార్యాలయంలో సెలవు రోజుల్లో సైతం పన్ను వసూళ్లకు విశేష స్పందన లభిస్తోందని నగరపాలక మేనేజర్ యన్.చిన్నరాముడు అన్నారు. శనివారం ఆయన పన్ను వసూళ్ల కేంద్రాన్ని పరిశీలించారు. శనివారం రూ.4.47 లక్షల టన్నులు వసూలు అయ్యాయని, ఆదివారం సైతం పన్ను వసూళ్ల కేంద్రం తెరిచే ఉంటుందని మేనేజర్ పేర్కొన్నారు. పన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మనగళం, కర్నూలు సిటీ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని డీఎస్డిఓ భూపతిరావు,రాష్ట్ర యోగ సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి, ఒలంపిక్ సంఘం సీఈవో విజయ్ కుమార్ అన్నారు. శనివారం కర్నూలు స్టేడియం నందు జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలను వారు ముఖ్యఅతిథిలుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 21 వరకు కర్నూలు అవుట్డోర్ స్టేడియంలో జరగబోయే 44 వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో జిల్లా క్రీడాకారులు పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో అంకితభావంతో ప్రతిరోజు ఎంచుకున్న క్రీడలో సాధన చేస్తే విజేతలుగా నిలవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం సెక్రెటరీ శ్రీనివాసులు, జిల్లా షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, జిల్లా స్కేటింగ్ సంఘం సీఈవో సునీల్ కుమార్,జిల్లా డ్రాగన్ బోట్ సంఘం అధ్యక్షుడు సాయి కృష్ణ, జిల్లా యోగ సంఘం ఉపాధ్యక్షులు విజయ్ భాస్కర్ రెడ్డి, రవి కుమార్, అశోక్ రెడ్డి,వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట లక్ష్మి, మాధవి, నరేంద్ర, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నృసింహా స్వామిని దర్శించుకున్న కాటసాని రామిరెడ్డి దంపతులు

మనగళం, ఆళ్లగడ్డ : అహోబిలం శ్రీ లక్ష్మీ నృసింహా స్వామిని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సతీమణి కాటసాని జయమ్మ, కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డి, కోడలు కాటసాని మేధాశ్రీ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి వేద పండితుల ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



## ఎస్ఐఆర్ వేగవంతం చేయాలి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐర్ – సర్) ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. శనివారం ఆయన శ్రీ దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ హైస్కూల్ వద్ద బీఎల్వోలు నిర్వహిస్తున్న ప్రత్యేక మ్యాపింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం, 2002 సంవత్సరంలో జరిగిన ఇంటెన్సివ్ రివిజన్ నాటి ఓటర్ల జాబితాను, ప్రస్తుతం ఉన్న 2025 ముసాయిదా ఓటర్ల జాబితాతో సరిపోల్చాలని ఆదేశించిందని, శని, ఆదివారాల్లో నియోజకవర్గంలో 20శాతం కంటే మ్యాపింగ్ తక్కువ ఉన్న పోలింగ్ బూత్ కేంద్రాల్లో ప్రత్యేక మ్యాపింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల వద్దకు బీఎల్వోలు వచ్చినప్పుడు సహకరించి, అవసరమైన సమాచారాన్ని అందించాలని కోరారు.

## మహాసభల విజయవంతం కోసం నిధులను సేకరించిన నాయకులు



మనగళం, కర్నూలు సిటీ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం సి క్యాంపు రైతు బజారు, లలిత కళా సమితి లో జరిగిన సమావేశం సందర్భంగా రూ. 18,700 విరాళాలు అందాయని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ తెలిపారు. విశాఖపట్నంలో జరిగే అఖిలభారత మహాసభలు విజయవంతం కోసం సంఘీభావంగా రైతు సంఘం నిధి సేకరణ చేయాలని పిలుపులో భాగంగా కర్నూలు నగరంలో సి క్యాంపు లలిత కళా సమితి ఆవరణంలో నిధి సేకరణ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కార్మిక కర్షక ఐక్యత కోసం పాటుపడుతున్న ఏపీ రైతు సంఘం తన వంతు కర్తవ్యం గా రాష్ట్రవ్యాప్తంగా నిధి సేకరణ చేస్తుందని, అందులో భాగంగా కర్నూల్ నగరంలో రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిధి సేకరణ చేపట్టామన్నారు. విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తారీఖు వరకు నిర్వహించే మహాసభలో కార్మికుల కర్షకుల సంబంధించిన అనేక తీర్మానాలు చేస్తామన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, అందుకోసం కార్మికులు, రైతులు సంఘటితం కావాల్సినటువంటి అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు గొందిపర్ల మాజీ సర్పంచ్ జి ఆంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి ఏ కృష్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు, షరీఫ్, మద్దిలేటి, గోపి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, సురేష్, లవకుశ, రఫీ, పందిపాడు, శీను తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కు మనోహర్ వినతి



మనగళం, కర్నూలు సిటీ : ఆటల్ మోదీ సుపరిపాలన బస్సు యాత్రలో భాగంగా కర్నూలు విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కు బీజేపీ నేత వేల్పుల గోపాల్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ బేడ బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ వినతి పత్రం అందజేశారు. కర్నూలు నగరంలో మోర్య ఇన్ హోట్ లో పీవీఎన్ మాధవ్ ను కలిసిన తూర్పాటి మనోహర్ తమ సామాజిక వర్గం ఎదుర్కుంటున్న సమస్యలను విన్నవించారు. బేడ బుడగ జంగం కులాన్ని షెడ్యూల్డ్ కులాల జాబితాలో కొనసాగించుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ అసెంబ్లీ తీర్మానం చేసి పంపించిందని, చట్టబద్ధత కల్పించేందుకు సహకారం అందించాలని తూర్పాటి మనోహన్ కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సూర్యకుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు 'క్లీన్ అండ్ గ్రీన్ సిటీ' స్పెషల్ డ్రైవ్

**– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ – 27 జేసీబీలతో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపు**

**– స్వచ్ఛంద శుభ్రతకు ఇచ్చిన గడువు ముగింపు – యజమానులు జరిమానా చెల్లించాకే నిర్మాణ అనుమతులు**



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా, ఆదివారం ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి నగర పరిధిలోని ఖాళీ స్థలాల్లో, రహదారుల ఇరువైపులా విస్తరించిన పిచ్చి మొక్కలను తొలగించడం జరుగుతుందని, ప్రజాప్రతినిధులచే డ్రైవ్ ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఏకకాలంలో ఖాళీ స్థలాల శుభ్రతకు ఒకేసారి ప్రత్యేకంగా 27 జేసీబీలను వినియోగిస్తున్నట్లు తెలిపారు.విస్తరిత ప్రాంతాల్లో ఖాళీ స్థలాల సమస్య అధికంగా ఉండటం వల్ల ఆ డివిజన్లకు అధిక సంఖ్యలో జేసీబీలను కేటాయించడం జరిగిందని, ఇప్పటికే పారిశుద్ధ్య సిబ్బంది అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. ఖాళీ స్థలాల యజమానులకు కొన్ని రోజులుగా పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పిచ్చి మొక్కల తొలగింపునకు ఈ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జన నివాసాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో పాములు, తేళ్ల నుంచి ప్రజలకు ముప్పు ఏర్పడటంతో పాటు, దోమలు, పందుల ఆవాసాల కారణంగా ప్రజారోగ్యానికి ముప్పు కలుగుతున్న అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖాళీ స్థలాల యజమానులకు విధించే జరిమానాను చెల్లించిన తర్వాతనే ఆయా స్థలాలకు వీఎల్‌టీ, భవన నిర్మాణ అనుమతులు, ఆస్తి పన్ను ప్రక్రియ చేపడతామని స్పష్టం చేశారు. ఖాళీ స్థలాల సమస్యకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే స్థానిక శానిటేషన్ కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్లను సంప్రదించాలని ప్రజలకు కమిషనర్ సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, శానిటేషన్ ఇంస్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా జవహర్ నవోదయ పరీక్ష

మనగళం, కర్నూలు సిటీ : ఉమ్మడి కర్నూల్ జిల్లాకు సంబంధించి శనివారం జవహర్ నవోదయ 6 వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ ఈ.పద్మావతి తెలిపారు. ఉదయం 11:30 గం నుండి 01:30 వరకు 24 కేంద్రాలలో పరీక్షలు జరిగాయన్నారు. మొత్తం 6,469మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకోగా 4,548 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈ పరీక్షకు సహకరించిన ఉమ్మడి జిల్లా ఉన్నత అధికారులు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

క్యూర్.. ప్యూర్.. రేర్ సమగ్రాభివృద్ధికేనా?

ఇటీవల విడుదలైన 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' డాక్యుమెంట్‌ను పరిశీలించాక స్పందించి రాసిన వ్యాసం ఇది. సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో గొప్ప అని చెప్పి ప్రకటించిన అభివృద్ధి విజన్ 'క్యూర్.. ప్యూర్.. రేర్' గురించి విన్నప్పుడు 'ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికెగిరినట్టు..' అన్న సామెత గుర్తుకు వచ్చింది.రేవంత్‌రెడ్డి చెప్పినదాన్ని బట్టి తెలంగాణను మూడు ఆర్థిక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయడమే ఈ క్యూర్.. ప్యూర్.. రేర్ పాలసీ. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రాంతమంతా (ఇటీవల జీహెచ్ఎంసీలో విలీనం చేసిన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు సహా) క్యూర్. ఈ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్ హబ్‌గా, నెట్ జీరో సిటీ (కాలుష్య రహిత నగరం)గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం ప్రకటించారు. ఇందుకోసం కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నగరం వెలుపలికి తరలించాలని నిర్ణయించారు. వరదలు, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంతో పాటు మూసీ ప్రక్షాళన, మెట్రో రైలు విస్తరణ ఇందులో ఉంటాయని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రాబోయే రీజనల్ రింగ్ రోడ్డు మధ్య ఉన్న ప్రాంతం ప్యూర్. ఈ ప్రాంతాన్ని మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మారుస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఫార్మా కంపెనీలు, ఐటీ సెజ్‌ల ఏర్పాటు, బుల్లెట్ రైలు కారిడార్లు, గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేల వంటి రవాణా సౌకర్యాలు ఈ ప్రాంతంలో వస్తాయని ఆయన చెప్పారు. రీజనల్ రింగ్ రోడ్డు నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు విస్తరించిన ప్రాంతమంతా రేర్. రేవంత్‌రెడ్డి దృష్టిలో ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కిందకు వస్తుంది. ఇక్కడ వ్యవసాయ ఆధారిత వృద్ధిని బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మూడు ప్రాంతాల అభివృద్ధి ద్వారా తెలంగాణను 2047 నాటికి బలమైన ఆర్థిక శక్తిగా, 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలని భావిస్తున్నట్లు రేవంత్ చెప్పారు.ూదీచీ ఛానల్ ఫాలో అవ్వండిూనజవతీఅంవఎవత్అయితే, ఈ పాలసీ రూపకల్పనలోనే లోపం ఉంది. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని చూస్తే ప్రాంతీయ అసమానతలు పెరిగే ప్రమాదం ఉంది. ఈ పాలసీలో భాగంగా హైదరాబాద్‌లోని పరిశ్రమలను ఔటర్ వెలుపలకు ఎలా తరలిస్తారు? వాటి కోసం అక్కడ భూములను కేటాయించారా? భూసేకరణ చేశారా? పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడారా? లాంటి ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. ఒకవేళ పరిశ్రమలను హైదరాబాద్ నుంచి తరలిస్తే ఉద్యోగుల పరిస్థితి ఏమిటి? వాళ్లంతా వలస వెళ్తే ఆ ప్రభావం అక్కడి గ్రామాలపై పడదా? ఈ మోడల్ వల్ల ప్రాంతీయ అసమానతలే కాకుండా, ప్రస్తుతం ఉన్న సామాజిక స్థిరత్వం కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్యూర్ ప్రాంతంలో కొత్త పరిశ్రమలు వస్తే అక్కడి ప్రజలపై కాలుష్యం తీవ్ర ప్రభావం చూపుతుంది. వ్యవసాయం దెబ్బతిని, భూగర్భ జలాలపై ప్రభావం పడుతుంది.రేర్ అంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అని రేవంత్‌రెడ్డి తేల్చేశారు. నిజంగా ఆ ప్రాంతమంతా గ్రామీణ ప్రాంతమేనా? పూర్వపు వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ లాంటి జిల్లా కేంద్రాలు కూడా గ్రామీణ ప్రాంతాలేనా? కేవలం వ్యవసాయ ఆధారిత పరిశ్రమల పేరు చెప్పి, ఈ నగరాల అభివృద్ధిని అడ్డుకుంటారా? ఇప్పటికే అనేక జిల్లాల్లో సిమెంట్ పరిశ్రమలు, రైస్ మిల్లులు, సింగరేణి, ఐటీసీ, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, టెక్స్‌టైల్ పార్క్, ఎంఎస్ఎంఈలు ఉన్నాయి. ఆ పరిశ్రమలను ఏం చేస్తారు? ఈ ప్రాంతాల్లో కొత్తగా ఆహారేతర పరిశ్రమలు పెట్టాలనుకుంటే వాటికి ప్రోత్సాహకాలు ఉంటాయా? ఈ విషయాలపై స్పష్టత ఇవ్వాలి.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఈ ప్రాంతమంతా సమగ్రంగా (వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, సేవల రంగం) అభివృద్ధి చెందుతూ వచ్చింది. జిల్లా కేంద్రాల్లో ఐటీ హబ్‌లతో పాటు ఇతర పరిశ్రమలను ఏర్పాటు చేసి బీఆర్ఎస్ ఒకే తరహా అభివృద్ధికి సంకల్పించి, ప్రణాళికలు రూపొందించి, అమలు చేసింది. దాంతో యువతకు స్థానికంగా ఉపాధి లభించింది. చైనా కూడా ఇలాంటి నమూనానే ఎంచుకున్నది. అందుకే అంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. నేను ఇటీవల చైనాలో పర్యటించినప్పుడు.. అక్కడి రైతులను కలిసి "మీకున్న ఈ కొద్ది రెండెకరాలతో కుటుంబం ఎలా గడుస్తుంది?" అని అడిగాను. అప్పుడు ఓ వృద్ధురాలు.. "మా పిల్లలంతా వ్యవసాయానికి అవసరమైనప్పుడు ఆ పనులు చేస్తారు.. ఖాళీ సమయాల్లో (దూరంగా ఉన్న ఓ పరిశ్రమను చూపిస్తూ) ఆ పరిశ్రమలో ఉపాధి పొందుతారు. అందుకే మాకు భూమి తక్కువ ఉన్నా ఆర్థికంగా ఇబ్బంది లేదు" అని చెప్పింది. అభివృద్ధి వికేంద్రీకరణతో ఉండే ప్రయోజనమిదే. వ్యవసాయంపైనే ఆధారపడకుండా పరిశ్రమలతో అక్కడి యువతకు ఉపాధి కల్పించేలా విధానాల రూపకల్పన జరగాల్సిన అవసరాన్ని ఈ అనుభవం స్పష్టం చేస్తోంది.రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొదట క్యూర్.. తర్వాత ప్యూర్.. ఆ తర్వాత రేర్‌పైన దృష్టి పెట్టే ప్రమాదం ఉంది. విస్తీర్ణం పరంగా రేర్ ప్రాంతమే విశాలమైనది. కానీ, గ్రామీణ ప్రాంతమన్న కారణంగా ఇక్కడి అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉంది. ఉద్యోగావకాశాలు తగ్గి యువత క్యూర్, ప్యూర్ పైన ఆధారపడాల్సిన పరిస్థితి వస్తుంది. రేర్ జోన్ ప్రాంతంలో పారిశ్రామిక, పట్టణ మౌలిక సదుపాయాల కల్పన కంటే గ్రామీణ, వ్యవసాయ ఆర్థిక పురోగతికి ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చే అవకాశం లేకపోలేదు.ఇప్పుడు మనం ముఖ్యంగా మాట్లాడుకోవాల్సింది.. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హిల్ట్) గురించి. రేవంత్‌రెడ్డి చెప్పిన క్యూర్.. ప్యూర్.. రేర్‌కు మూలం ఈ పాలసీలోనే ఉంది. మొదట రేవంత్ సర్కారు దీనినే ప్రకటించింది. హైదరాబాద్‌లోని పరిశ్రమల భూములను ఇతర అవసరాల కోసం వాడుకుంటామని, పరిశ్రమలను ఔటర్ వెలుపలకు తరలిస్తామని అప్పుడే చెప్పారు. ఈ హిల్ట్ పాలసీకి పైపూతగా మూడంచెల అభివృద్ధి మోడల్‌ను ప్రకటించారు రేవంత్. జాగ్రత్తగా గమనిస్తే ఈ మోడల్‌లో మొదటి అంశం పరిశ్రమలను తరలించడమే. అందుకోసమే హిల్ట్‌ను తీసుకొచ్చారు. దీని వెనుక ఉన్న లోగుట్టు ఏమిటనేది తెలంగాణ సమాజం తెలుసుకోవాలి. రేవంత్ విజన్ వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం రాష్ట్ర సమగ్రాభివృద్ధేనా అన్నదే అసలు అనుమానం.

## మంత్రాలయంలో రెండో రోజు కొనసాగుతున్న దీక్ష

మనగళం, మంత్రాలయం : మంత్రాలయంలో రెండవ రోజు ఆదోని జిల్లా సాధనకై కొనసాగుతున్న దీక్షలో సూగురు గ్రామస్తులు గర్జి రాజేష్, కాలేబు, ఆనందు, తోటయ్య, హనుమప్ప, లక్ష్మన్న, ముక్కరప్ప జయరాజు,హుసేని మద్దతుగా కూర్చున్నారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ రామతీర్థం అంమ్రేష్ మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలోని కూటమి, ప్రతిపక్ష పార్టీల నేతలు ఆదోని జిల్లా సాధనకు అనుకూలమా లేక వ్యతిరేకమా అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. పశ్చిమ ప్రాంతంలోని ప్రజలు అందరూ ముక్తకంఠంతో ఆదోని జిల్లాగా కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. దీక్షకు మద్దతుగ బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం మంత్రాలయం అధ్యక్షుడు మాదప్ప, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు యోబు, భీమన్న, మంత్రాలయం దళిత సీనియర్ నాయకులు సుందర్రాజు, దేవదాసు,ప్రభుదాసు, రాజు, బహుజన సమైక్య సమితి కర్నూలు జిల్లా కన్వీనర్ ప్రసన్నకుమార్, గుడికల్ గ్రామ దళిత సీనియర్ నాయకుడు నాగరాజు, మాల మహానాడు జిల్లా కన్వీనర్ గోవిందు తదితరులు సంఘీభావం తెలిపారు.



## రాములమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మండలం టిడిపి నాయకులు..

**– మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం చేసిన టిడిపి మండల నాయకులు..**

నందవరం డిసెంబర్ 13 మనగళం న్యూస్ నందవరం మండలంలోని నది కైరవాడి మాజీ ఉపసర్పంచ్ బోయ రాములమ్మ డీలర్ బజారి వదిన స్వర్గస్తులైనారు. ఈ సందర్భంగా రాములమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు వారి కుటుంబ సభ్యులకు 10,000 రూపాయల ఆర్థిక సహాయన్ని అంత్యక్రియలకు టీడీపీ నాయకులు అందజేయడం జరిగింది. రాములమ్మ కుటుం సభ్యులకు అన్ని రకాలుగా ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని టీడీపీ నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కాశీంవలి మాజీ మార్కెట్ రామకృష్ణారెడ్డి క్లస్టర్ ఇంచార్జ్ వీరేష్ కో యూనిట్ ఇంచార్జ్ సత్య రెడ్డి




, టీడీపీ నాయకులు సామేలు మా భూషణ్ మరియు గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శబరిమలైకు కాలినడకన మహాపాదయాత్రను దిగ్విజయంగా పూర్తిచేసిన అయ్యప్పలకు సన్మానం





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని కొండపేట ప్రాంతానికి చెందిన బెస్త నరసింహులు స్వామి ఇంట్లో అయ్యప్పస్వామి పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోడుమూరు నుంచి శబరిమలైకు 5వ సారి నవంబర్ 8వ తేదీన అయ్యప్ప కొండకు మహాపాద యాత్ర మొదలుపెట్టి 30 రోజులు కాలినడకన దాదాపు 1100 కిలోమీటర్లు నడుచుకుంటూ అయ్యప్ప స్వామిని చేరుకొని ఆ మణికంఠ స్వామిని దర్శనం చేసుకుని వారి ఆశీర్వాదాలు పొంది తిరిగి ఇంటికి క్షేమంగా వచ్చిన సందర్భంగా బెస్త నరసింహులు స్వామి ఇంట్లో అయ్యప్ప స్వాములు అందరితో కలిసి అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించుకున్నాడు ఈ పూజా కార్యక్రమం అంతా గురు స్వామి అయిన గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు వీరు ఆ మణికంఠునికి పంచమృతాభిషేకము మరియు పడిపూజ స్వామికి విశేష పూజలు బెస్త నరసింహులు కుటుంబం చేతుల మీదుగా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ అయ్యప్ప స్వామి పడిపూజ స్థానిక అయ్యప్పస్వాములతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా 30 రోజుల ప్రయాణంలో మాకు ఎటువంటి ఆటంకాలు ఆ మణికంఠను దయవల్ల కలగలేదని హైదరాబాదు నుంచి వచ్చిన 250 మంది శబరి గిరీష మహాపాదయాత్ర బృందంతో కలిసి ప్రయాణించామని మా మంచి చెడులన్నీ వారే చూసుకున్నారని ఈ సందర్భంగా వారు తెలియజేశారు అనంతరం తనతో పాటు మొదటిసారిగా కోడుమూరు నుంచి శబరిమలై మహాపాదయాత్రను తనతోపాటు దిగ్విజయంగా పూర్తి చేసి గూడూరుకు చెందిన వీరేంద్ర స్వామిని బెస్త నరసింహులు స్వామి మరియు గంగాధర్ స్వామి కలిసి వీరేంద్ర స్వామిని సన్మానించారు అలాగే కోడుమూరు అయ్యప్ప స్వాములకు అన్ని విధాలుగా సహకరిస్తున్న గంగాధర్ గురుస్వామి ను నరసింహులు ఘనంగా సన్మానించారు అలాగే వచ్చిన అయ్యప్పలకు భక్త బృందానికి అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో కోడుమూరు అయ్యప్పస్వాముల భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ 19,577 కేసులు పరిష్కారం

మనగళం, కర్నూలు సిటీ : జాతీయ లోక్ అదాలత్, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 19,577 కేసులు పరిష్కారం అయ్యాయి. 197 మోటార్ ఆక్సిడెంట్ కేసులలో 6,34,62,000 బాధితులకు నష్టపరిహారంగా ఇన్సూరెన్స్ కంపెనీల నుండి ఇప్పించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ మొత్తం రెండు జిల్లాల్లో 28 బెంచీలను ఏర్పాటు చేసి 284 సివిల్ కేసులు, 197 మోటార్ యాక్సిడెంట్ కేసులు, 19096 క్రిమినల్ కేసులను పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమాల్లో మొదటి అదనపు జిల్లా జడ్జి కమలాదేవి, ఆరవ అదనపు జిల్లా జడ్జి వాసు, ఏడవ అదనపు జిల్లా జడ్జి లక్ష్మి రాజ్యం, కర్నూలు బార్ ప్రసిడెంట్ హరినాథ్ చౌదరి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, రిటైర్డ్ అదనపు జిల్లా జడ్జి లక్ష్మినరసింహారెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మల్లేశ్వరి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి అనూష, కోర్టుమా నిటరింగ్ సీఐ. రామానాయుడు, న్యాయ వాదులు, బ్యాంక్ అధికారులు, బీఎస్ ఎన్ ఎల్ అధికారులు, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# చరిత్రలో మరచిపోలేని నాయకుడు భారత రత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి.

**– సిద్ధాంతాలు, విలువలతో రాజకీయం చేసిన మహనీయుడు. – ప్రపంచదేశాలకు దీటుగా,భారత దేశం అభివృద్ధి కి పాటుపడ్డారు.**





మనగళం, నంద్యాల ప్రపంచదేశాలకు దీటుగా భారతదేశం అభివృద్ధికి పాటుపడి చరిత్రలో మరచిపోలేని నాయకులు భారత రత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి అని వైద్య ఆరోగ్యశాఖ మాత్యులు సత్యకుమార్ యాదవ్ అభివర్ణించారు. అటల్ బిహారీ వాజపేయి శతజయంతి నీ పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ల్లో ఆయన విగ్రహ ప్రతిష్ఠ నంద్యాలలో ఏర్పాటు చేస్తున్న సందర్భంగా నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు ఆధ్వర్యంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి.వి. ఎన్ మాధవ్ నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు బిసి జనార్ధన్ రెడ్డి, ఎన్.ఎం.డి.ఫరూక్, సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం బహిరంగ సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి చరిత్రలో మరచిపోలేని నాయకులన్నారు. సిద్ధాంతాలు, విలువలతో రాజకీయం చేసిన మహనీయుడన్నారు. ప్రపంచదేశాలకు దీటుగా భారత దేశం అభివృద్ధి చెందాలని ఆ దిశగా కృషిచేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు. రహదారులు, ఐటి, పారిశ్రామిక, విద్యా, వైద్యం, ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించి మార్గదర్శకుడయ్యారన్నారు. వాజపేయి పాలనలో ప్రతిపాదించిన సుపరిపాలన,జాతీయ ఐక్యత,సమగ్ర అభివృద్ధి విధానాలు దేశానికి కొత్త దిశ చూపించాయన్నారు.దేశం ముందుకు ఎలా వెళ్లాలి అని దూరదృష్టిని నిర్దేశించారన్నారు. వాజపేయి ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ కొనసాగిస్తూ పథకాలను మరింత విస్తరింపజేస్తున్నారని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం 11 ఏళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధితో 25 మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారన్నారు.వాజపేయి, మోదీ నాయకత్వాలు అందించిన అభివృద్ధితో ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్త లో 10 వ స్థానంలో ఉన్న భారతదేశం 4 వ స్థానంకు చేరే విధంగా చేశారన్నారు. సాధారణ కుటుంబంలో జన్మించి సిద్ధాంతాలు ,విలువలతో కూడిన రాజకీయాలు చేశారన్నారు.10 సార్లు లోక సభ,2 సార్లు రాజ్యసభకు ఎన్నికై హుందాగా రాజకీయాలు చేశారన్నారు.విద్యార్థి దశ నుంచే రాజకీయాలు చేసి 70 ఏళ్ల వరకు రాజకీయాల్లో ప్రజాసేవ చేశారన్నారు.దేశంలోని రైతులకు,వ్యవసాయం,శాంతి భద్రతలు,అక్కా చెల్లెళ్ల బాగోగులు,నిరుద్యోగ సమస్య పై నిరంతర శ్రామికుడిగా పనిచేశారన్నారు.దేశంలో 12 సార్లు లోక సభ,రాజ్య సభ తో పాటు మూడు సార్లు ప్రధానిగా చేసి మచ్చలేని నాయకుడుగా రాజకీయాల్లో పేరు తెచ్చుకున్నారన్నారు. నమ్ముకున్న సిద్ధాంతాలకు రాజి పడకుండా,ప్రతి పక్షాలను మాటల అంకుశంతో పొడుస్తూ అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్న నాయకుడు అన్నారు. ప్రపంచదేశాల అజమాయిషీ తల వంచక వారి తోక కత్తెరించడంలో ఆయనకు ఆయనే సాటి అని నిరూపించుకున్నారన్నారు. దేశ ప్రయోజనాలకోసం నేను కూలిపోతాను కానీ తల వాంఛను అని అమెరికాకు హెచ్చరికలు చేశారన్నారు.

కళాత్మక భావాలు ఉన్నవారు కావడంతో అపజయాన్ని ఒప్పుకోను,కాలం గీసిన గీతను చెరిపేసే విధంగా ప్రణాళికలు రూపొందించారు. రైతులు పండించిన పంటలు తీసుకొని పోవడానికి దారిన రోడ్డు మార్గాలు లేకపోవడంతో దేశ వ్యాప్తంగా గ్రామీణ రోడ్ల ను 60 వేల కోట్లతో అభివృద్ధి చేశారన్నారు.పనికి ఆహార పథకం కింద వ్యవసాయ కూలీలకు కనీస వేతనం కింద అప్పట్లోనే 70 నుంచి 80 వేలకోట్లు విడుదలచేశారని గుర్తుచేశారు. వాజపేయి అనుసరించిన విధానాలను మోదీ హయంలో 86 వేల కోట్లు విడుదల చేశారన్నారు. రైతులకు పంట భీమా పథకాన్ని ఏర్పాటు చేసి లక్షా,75 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశారన్నారు. దేశంలో ప్రతి ఒక్కరు విద్యను అభ్యసించేవిడంగా కళాశాలలు, యూనివర్సిటీ లు, ఐ ఐ టి నూతన విద్యా విధానాన్ని అమలులోకి తీసుకొని రావడంతో ఎందరో విద్యావంతులు అయ్యారన్నారు. సంపద సృష్టించడం డబ్బు ప్రామాణికం కాదని అభివృద్ధితోవాంపడ సృష్టించవచ్చని నిరూపించారన్నారు. దేశ వ్యాప్తంగా 58 వేల కోట్లతో హైవే లు 111 లక్షల కోట్లతో మౌలికసదుపాయాలు కల్పించారన్నారు. మోదీ ఆశయాలకు అనుగుణంగా కూటమి పాలనలో ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో 65 వేల కోట్లతో అభివృద్ధి శ్రీకారం చుట్టారన్నారు.



అమరావతి,బెంగళూరు హైవే నిర్మాణం సాగుతుందన్నారు. ల్యాండ్ లైన్ సేవల నుంచి సెల్ ఫోన్ సేవలకు అంకురార్పణ చేశారన్నారు. అయిదు ఏళ్లలో 27 దేశాలు లుకలుకలు లేకుండా చేశారన్నారు. పాకిస్తాన్ తో స్నేహహస్తం కోసం లాహోర్ బస్సును ఏర్పాటు చేసి కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు బస్సు యాత్ర చేశారన్నారు. పాకిస్తాన్ బుద్ధి మారకపోవడంతో కార్గిల్ యుద్ధంలో భారత దేశం సత్తా చాటుకునేలా చేశారన్నారు. పాకిస్తాన్ భారత దేశం తో మిత్రత్వం కంటే మీ దేశంలో మీ ప్రభుత్వాన్ని ప్రజలు చి కొడుతున్నారని హిత బోధ చేసినా బర్ఫీ మారలేదన్నారు. పాకిస్తాన్ ఎన్నో ఉగ్రదాడి లు చేసినా భారత్ సర్జికల్ స్ట్రైయిట్,ఆపరేషన్ సిందూర్ తో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉగ్రవాదుల స్థావరాలు, ఎయిర్ బేస్ లు నాశనం చేశారన్నారు. వందేమాతరం,బుల్లెట్ ట్రైన్లు బిజెపి ప్రభుత్వ హయంలో రూపుదిద్దుకున్నాయని అన్నారు. అప్పటి ప్రధాని పి వి నరసింహారావు హయంలో నంద్యాల ఎర్రగుంట్ల రైల్వే పనులకు 900 కోట్లతో పూర్తి చేశారన్నారు. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ సత్త జయంతి సందర్భంగా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహ ప్రతిష్ఠకు రావడం పూర్వ జన్మ సుకృతం అని అన్నారు. ప్రధాని గా మూడు సార్లు పదవులు పొంది భారత దేశం అభివృద్ధికి కృషి చేశారన్నారు. సింగపూరు, దుబాయ్ తరహాలో ఆంధ్ర ప్రదేశ్ లో రహదారుల నిర్మాణాలకు లక్ష కోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కష్టపడుతున్నారు.



వైసిపి ప్రభుత్వంలో వెనిక్కి పోయిన పరిశ్రమలు వస్తున్నాయన్నారు. మంత్రి నారా లోకేష్ పరిశ్రమలు వచ్చేందుకు కృషి చేస్తూ లక్షల కోట్లు తో పరిశ్రమలు ఏర్పాటు చేస్తూ నిరుద్యోగ సమస్య కు పరిష్కారం చూపుతున్నారన్నారు. మంత్రి ఎన్.ఏం.డి.ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు మధు అంటే తెలియదు కానీ అభిరుచి మధు అంటే ఒక బ్రాండ్ స్థాయికి ఎదిగారన్నారు. అభిరుచి మధు కు నా పై ప్రత్యేక అభిమానమన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి,ప్రధాని నరేంద్ర మోదీ తో ఉన్న సన్నిహితాన్ని వివరిస్తూ గతంలో ప్రధానిగా వాజపేయి పనిచేస్తున్న సమయంలో మైనార్టీలు హజ్ యాత్ర,మక్కా కు వెళ్లేందుకు విమాన ప్రయాణం కష్టంగా మారిందన్నారు.సీఎం నన్ను ప్రధాని వద్దకు వెళ్లి హజ్ యాత్ర కు అనుమతులు తీసుకొని రావాలని చెప్పడంతో అక్కడ ప్రధాని తో కలిసి కేవలం అయిదు నిమిషాల్లో హజ్,మక్కా కు హైదరాబాద్ నుంచి మక్కా కు విమాన యానా సౌకర్యం డైరెక్ట్ గా ఉండే సౌకర్యం కల్పించారని గుర్తుచేశారు.హైదరాబాద్ లో హి టెక్ సిటీ నిర్మాణానికి ప్రధాని అటల్ బిహారీ వాజపేయి సహకరించడంతో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేశారన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి. ఎన్.మాధవ్ మాట్లాడుతూ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వ్యక్తిత్వం అందరిని కలుపుకొని పోయేవారు అన్నారు.పార్లమెంట్ పై దాడి జరిగిన సమయంలో 8 మంది జవాన్లు వీర మరణం పొందారన్నారు.పార్లమెంట్ పై దాడిని వాజపేయి సీరియస్ గా తీసుకుని పాకిస్తాన్ హస్తం ఉండడంతో సైన్యం కు పూర్తి ఆదేశాలు ఇచ్చి దాదాపు 100 మంది ఉగ్రవాదులను జైల్లో పెట్టించారన్నారు. భారతదేశంపై కక్ష కాకుండా ప్రేమ పెంచుకోవాలని ఎన్ని సార్లు ప్రయత్నించినా పాకిస్తాన్ వక్ర బుద్ధి మారకపోవడంతో కార్గిల్ యుద్ధం గట్టి గుణపాఠం ఇచ్చిందన్నారు. ప్రపంచదేశాలు భారత వైపు కన్నెత్తి చూడకుండా మోదీ పాలనలో దీటైన జవాబు ఇస్తున్నారన్నారు. భారత స్వతంత్రం వచ్చిన తర్వాత భారత దేశం మట్టి గడ్డ కాదని పార్లమెంట్ లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి చేసిన ప్రసంగం అందరినీ మంత్రముగ్దులు చేసిందన్నారు.భారతదేశ అభివృద్ధి చెందాలని విదేశీ వస్తువులు వద్దు,స్వదేశీ వస్తువులు వదలి అనే నినాదం తీసుకొచ్చారన్నారు.స్వచ్ఛ భారత్ తో దేశం వికసిత్ భారత్ తో పాటు వికసిత్ ఆంధ్రప్రదేశ్ గా మారాలన్నారు.మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ నుంచే ప్రారంభించడం గర్వకారణం అన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి దూరదృష్టితో హైవే లు ఏర్పాటుచేయడంతో దేశం రూపురేఖలు మారిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వానికి, బీజేపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందించడం వల్ల రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని అన్నారు. నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు మాట్లాడుతూ బిజెపి పార్టీ నాయకులకు రాయలసీమ అంటే ప్రాణమన్నారు. రాయలసీమ నుంచే అన్ని కార్యక్రమాలు మొదలు కావడం సంతోషం అన్నారు. మహా నాయకులు ప్రపంచంలో వెలుగులోకి తీసుకొని రావాలని, నేటి యువతకు తెలిసే విధంగా బిజెపి, కూటమి ప్రభుత్వం ఆలోచించి రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాల్లో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నారన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ వచ్చిన తర్వాత ప్రతి కార్య కర్తకు న్యాయం జరుగుతుందన్నారు.రాష్ట్రంలో అన్ని వర్గాలు ఆశిస్తున్న విధంగా సముచిత స్థానం అందిస్తున్నారని అన్నారు.కూటమి నాయకులం అందరం కలసి కట్టుగా రాష్ట్ర అభివృద్ధికి పాటు పడతామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని బిజెపి, జన సేన, తెలుగు దేశం నాయకులు హాజరయ్యారు.

# జియోమార్ట్‌లో ఐఫోన్ 15 ప్రోపై భారీ తగ్గింపు

హైదరాబాద్ డిసెంబర్ 13 మనగళం, ఐఫోన్ కొనాలని ఎంతకాలంగా ఎదురు చూస్తున్న వారికి ఇదొక అసలైన శు భవార్త. సాధారణంగా ధరల్లో పెద్దగా తగ్గింపులు రానని భావించే ఐఫోన్ మోడళ్లలో ఇప్పుడు జియోమార్ట్ ఆశ్చర్యపరిచే ఆఫర్‌ను ప్రకటించింది. ముఖ్యంగా ఐఫోన్ 15 ప్రో (128+దీ) మోడల్‌పై ఇచ్చిన భారీ తగ్గింపు వినియోగదారులను విపరీతంగా ఆకర్షిస్తోంది.మార్కెట్‌లో మొదట అందుబాటులోకి వచ్చినప్పుడు ఈ మోడల్ ధర రూ.1,34,900 కాగా, ఇప్పుడు జియోమార్ట్‌లో అదే ఫోన్ కేవలం రూ.62,953కే లభిస్తోంది. అంటే అర్ధధరకంటే తక్కువకు ఈ ఫోన్‌ను సొంతం చేసుకునే అవకాశం లభించడం టెక్ ప్రేమికులను ఉత్సాహపరుస్తోంది.మరింతగా, ఎస్బీఐ కోబ్రాండ్ ప్లాటినం క్రెడిట్ కార్డ్ ఉన్న కస్టమర్లకు జియోమార్ట్ అదనంగా 5 శాతం క్యాష్‌బ్యాక్ అందిస్తోంది. ఈ సదుపాయం వల్ల కొనుగోలు ధర మరింత తగ్గుతుంది. పండుగ సీజన్‌కు ముందు ఇలాంటి ఆఫర్ రావడంతో, ఈ మోడల్ అమ్మకాలు రాబోయే రోజుల్లో భారీగా పెరిగే అవకాశం ఉంది.ఈ ఫోన్‌లో ఉండే ప్రత్యేకతలు కూడా వినియోగదారులను ఆకట్టుకునే అంశాలే. 6.1 అంగుళాల సూపర్ రెటినా ఎక్స్‌డీఆర్ ఒలెడ్ డిస్‌ప్లే, వేగవంతమైన పనితీరుకు ప్రసిద్ధి చెందిన ఆపిల్ ఞా17 ప్రో చిప్‌సెట్, అత్యుత్తమ నాణ్యతను అందించే 48 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరా, అలాగే దీర్ఘకాలం పనిచేసే 3274 ఎంఏహెచ్ బ్యాటరీ ఈ ఫోన్‌కు అదనపు బలం.ఐఫోన్ కొనాలని అనుకుంటూ వేచి ఉన్నవారికి ఇది మంచి అవకాశమని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఇటువంటి భారీ తగ్గింపులు తరచుగా రాకపోవడం వల్ల, వినియోగదారులు త్వరగా ఆఫర్‌ను వినియోగించుకోవాలని సూచన.



## కాటసాని ఉమామహేశ్వరమ్మకు జన్మదిన శుభాకాంక్షలు



మనగళం, బనగానపల్లె : వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మకు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.వైసీపీ నాయకులు, నాయకురాళ్లు, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల ప్రతినిధులు ఉమా మహేశ్వరమ్మకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయించి సంబరాలు చేసుకున్నారు.

# శ్రీరాముడి జీవనం... మానవాళికి ఆదర్శం

మనగళం, కొలిమిగుండ్ల : శ్రీరాముడి జీవినమే సర్వమానవాళికీ ఆదర్శమని, ఆదర్శజీవనానికీ, అన్యోన్యతకు, శ్రీమద్రామాయణం ఆదర్శంగా నిలుస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల మండలం, ఎర్రగుడి గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం నందు గత ఐదు రోజులుగా జరుగున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో ఘనంగా జరిగాయి. మూడు రోజులపాటు స్థానిక భజన మండలి చేసిన భజనలు, ధర్మప్రచారకులు నిత్యతృప్తదాస్ చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ముగింపు సందర్భంగా వేదపండితులు నంద్యాల నాగసాయి వరకుమార్ శర్మ ఆధ్వర్యంలో కృష్ణ యజుర్వేద పండితులు ఎన్. నాగసాయి శ్రవన్ కుమార్ శర్మ, ఎన్.నాగసాయి మణికంఠేశ్వర శర్మ, మహిళలందరితో గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ



చైర్మన్ గుండం బాల సుబ్బారెడ్డి, ఎగ్గోని రామసుబ్బారెడ్డి, హార్మోనిష్టు కాతా గోపాల్ రెడ్డి, మోటాటి సుంకిరెడ్డి, లలితమ్మ, కాతా విజయలక్ష్మీ, దాసరి ఉమా, మద్దిలేటి, రమణారెడ్డి భక్తులు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ మొత్తాన్ని రెట్టింపు చేస్తారా?

డిసెంబర్ 13 , మనగళం : దేశవ్యాప్తంగా కోట్లాది రైతులు ఎదురుచూస్తున్న కీలక స్పష్టతపై కేంద్ర ప్రభుత్వం చివరకు స్పందించింది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద ఇచ్చే వార్షిక సహాయం రూ.6,000 నుంచి రూ.12,000కి పెరుగుతుందా? అనే ప్రశ్న గత సంవత్సరం నుంచే రైతుల్లో పెద్ద చర్చగా మారింది. ముఖ్యంగా 2024 డిసెంబరులో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సంవత్సరానికి రూ.12,000 ఇవ్వాలని సిఫార్సు చేసిన తర్వాత రైతుల్లో ఆశలు పెరిగాయి.ఈ నేపథ్యంలో డిసెంబర్ 12న రాజ్యసభలో ఎంపీ సమిరుల్ ఇస్లాం మంత్రి సమాధానం కోరగా, వ్యవసాయరైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ పూర్తిగా స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం పీఎం కిసాన్ మొత్తాన్ని పెంచే ప్రతిపాదన కేంద్రం పరిగణనలోకి తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. దీంతో రైతుల్లో నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది.ఇక కిసాన్ ఐడి గురించి వచ్చిన మరో ప్రశ్నకు మంత్రి వివరణ ఇచ్చారు. కొత్త రిజిస్ట్రేషన్లకు మాత్రమే కిసాన్ ఐడి అవసరమని, దేశంలోని 14 రాష్ట్రాల్లో రైతు రిజిస్ట్రి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి అన్నారు. ఇంకా ఈ ప్రక్రియ మొదలుకాని రాష్ట్రాల్లో రైతులు కిసాన్ ఐడి లేకుండానే పీఎం కిసాన్‌కు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.పీఎం కిసాన్ 2019లో ప్రారంభమైందంటే కాలం కొద్దే అయినా, దేశ చరిత్రలోనే అతిపెద్ద ప్రత్యక్ష ప్రయోజన బదిలీ పథకాలలో ఒకటిగా నిలిచింది. ఇప్పటి వరకు 21 విడతల్లో రూ.4.09 లక్షల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి చేరాయి. సాగు భూమి ఉన్న రైతులకు ఏడాదికి మూడు విడతలుగా రూ.2,000 చొప్పున మొత్తాన్ని ప్రభుత్వం జమ చేస్తోంది.లబ్ధిదారుల జాబితాలో తన పేరు ఉందో లేదో తెలుసుకోవాలంటే రైతులు వెబ్‌సైట్‌లోని రైతు కార్నర్ విభాగంలో వివరాలు నమోదు చేసి సులభంగా తనిఖీ చేసుకోవచ్చు.ఇక మొత్తానికి ప్రభుత్వ సమాధానం స్పష్టం పీఎం కిసాన్ మొత్తం ప్రస్తుతం రెట్టింపు కాదు. పథకం మాత్రం కొనసాగుతుంది, రైతులకు సహాయం వర్తిస్తుంది.

# ఇది బస్టాండ్ డా... లేక పండ్ల మార్కెట్ నా..?

**– ఆలూరు పాత బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికుల్లో నెలకొన్న గందరగోళం.**

( ఆలూరు మనగళం ):ఆలూరు మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతం ప్రస్తుతం ప్రయాణికులకు పెద్ద సందేహానికి కారణమవుతోంది. బస్టాండ్ పరిసర ప్రాంతంలో పండ్లు, పూల, కూరగాయల వ్యాపారం, విస్తృతంగా జరుగుతుండటంతో ఇది బస్టాండ్.? లేక పండ్ల మార్కెట్టా.? అనే అనుమానం ప్రయాణికుల్లో నెలకొంది. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పాత బస్టాండ్ ప్రాంతంలో పండ్లు, పూలు, కూరగాయలు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో బస్సుల కోసం వచ్చిన ప్రయాణికులు సరైన ప్లాట్‌ఫాం ఎక్కడ? బస్సులు ఎక్కడ నిలుస్తాయి? అనే విషయాల్లో అయోమయానికి గురవుతున్నారు. ముఖ్యంగా బయట ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు ఇది బస్టాండ్ అని గుర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ప్రయాణికులు స్థానికులను అడగగా, ఇది పండ్ల మార్కెట్ కాదు..ఇది పాత బస్టాండ్ ప్రాంతమే అని వారు వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. అయినప్పటికీ స్పష్టమైన సూచిక బోర్డులు లేకపోవడం, బస్టాండ్‌కు తగిన మౌలిక సదుపాయాలు కనబడకపోవడం వల్ల ప్రయాణికుల అనుమానం తీరడం లేదు. బస్టాండ్ ప్రాంగణంలో పండ్లు, పూల వ్యాపారానికి అనుమతి ఎలా ఇచ్చారన్న ప్రశ్న కూడా ప్రజల్లో వినిపిస్తోంది. ట్రాఫిక్‌కు



అంతరాయం కలగడం, ప్రయాణికులు నడిచేందుకు సరైన స్థలం లేకపోవడం వల్ల మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పాత బస్టాండ్ ప్రాంతాన్ని క్రమబద్ధీకరించాలని, బస్టాండ్ అని స్పష్టంగా కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని, పండ్ల మార్కెట్‌కు వేరే స్థలం కేటాయించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఈ అయోమయం మరింత పెరిగే అవకాశముందని వారు హెచ్చరిస్తున్నారు.

# ప్రతి పీఎఫ్ ఖాతాదారుడికీ రూ.50 వేలు వస్తాయా?

హైదరాబాద్ డిసెంబర్ 13 , మనగళం :, దేశంలోని కోట్లాది ప్రైవేట్ ఉద్యోగులు ఆత్రుతగా ఎదురుచూస్తున్న పీఎఫ్ వడ్డీ రేట్లపై కేంద్ర ప్రభుత్వం త్వరలోనే శుభవార్త చెప్పే అవకాశముంది. 202526 ఆర్థిక సంవత్సరానికి వడ్డీ రేటు పెరిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం వడ్డీ రేటు 8.75 శాతం వద్ద నిర్ణయించే అవకాశం ఉందని వర్గాలు చెబుతున్నాయి. 202425 సంవత్సరానికి ప్రభుత్వం 8.2 శాతం వడ్డీని ఇప్పటికే ఖాతాల్లో జమ చేసిన విషయం తెలిసిందే.పూర్తి దేశంలో సుమారు 8 కోట్ల మంది పీఎఫ్ సభ్యులకు ఇది నేరుగా ప్రయోజనం చేకూర్చే విషయం. ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన చేయకపోయినా, జనవరిలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్న సమాచారంతో ఉద్యోగుల్లో ఆకాంక్ష పెరిగింది.ఇకపోతే, పీఎఫ్ ఖాతాదారుడి అకౌంట్లో రూ.50 వేలు పడతాయనే ప్రచారం సోషల్ మీడియాలో విస్తరిస్తోంది. అయితే వాస్తవం పూర్తిగా భిన్నం. పీఎఫ్ ఖాతాలో ఎంత మొత్తం ఉందో దాని మీదే వడ్డీ లాభం ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు:పీఎఫ్ బ్యాలెన్స్ రూ.5 లక్షలు ఉంటే8.75% వడ్డీ ప్రకారం వడ్డీ దాదాపు రూ.42 వేలు వచ్చే అవకాశముంది.పీఎఫ్ బ్యాలెన్స్ రూ.6 లక్షలు ఉంటేవడ్డీ




సుమారు రూ.50 వేల వరకు చేరవచ్చు.అంటే ప్రతి ఒక్కరికీ రూ.50 వేలు రావు.ఎవరెవరికి ఎంత వస్తుందనేది వారి పీఎఫ్ సేవింగ్స్ పరిమాణం మీదే ఆధారపడి ఉంటుంది.నిజానికి పీఎఫ్ వడ్డీ రేటు పెరగడం అనేది ఉద్యోగులకు పెద్ద ఊరట. జీతం పెరగకపోయినా, పీఎఫ్ ద్వారా వచ్చే లాభం పెరగడం భవిష్యత్ భద్రత పరంగా ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

## ఎస్‌బీఐ వినియోగదారులకు శుభవార్త

డిసెంబర్ 13 , మనగళం ,: బ్యాంకు కస్టమర్లకు ఉపశమనం కలిగించేలా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ రకాల రుణాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తూ కొత్త సవరించిన రేట్లు ఈ నెల 15వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి.హోం రుణాలు, వాహన రుణాలు, వ్యాపార రుణాలు తీసుకున్న వారికి ఈఎంఐ భారం కొంత తగ్గే అవకాశం ఉంది. అన్ని కాలపరిమితులపై లిమార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటు (ఎం.సి.ఎల్.ఆర్)లను 5 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ఒక సంవత్సరం ఎం.సి.ఎల్.ఆర్ 8.70 శాతంగా నిర్ణయించారు.అదే విధంగా రుణాలపై వర్తించే బాహ్య ప్రమాణ రుణ రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 7.90 శాతానికి కుదించారు. ఇప్పటికే రుణాలు కొనసాగిస్తున్న వారికి వర్తించే బేస్ రేటును కూడా 10 శాతం నుంచి 9.90 శాతానికి తగ్గించారు.మరోవైపు, రూ.3 కోట్ల లోపు రిటైల్ కాలపరిమితి డిపాజిట్లపై వడ్డీలు స్వల్పంగా తగ్గాయి. 2 నుంచి 3 సంవత్సరాల డిపాజిట్లకు వడ్డీ 6.45 శాతం నుంచి 6.40 శాతానికి తగ్గింది. సీనియర్ సిటిజన్లకు ఇదే కాలపరిమితిపై వడ్డీ 6.95 నుంచి 6.90 శాతంకు తగ్గింది.ప్రముఖ 444 రోజుల 'అమృత్ వృష్టి' డిపాజిట్ పథకంపై వడ్డీ రేటు 6.60 నుంచి 6.45 శాతానికి తగ్గింది.ఇటీవల ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక స్థిరత్వం పెరగడంతో కేంద్రం మూలధన కేటాయింపును గత కొన్నేళ్లుగా తగ్గించిన విషయమూ తెలిసిందే.

# టాటా కారుకు కొత్త రికార్డు 29 కి.మీ మైలేజీ

ఇండోర్ డిసెంబర్ 13 , మనగళం ,: టాటా మోటార్స్ తాజా సియెర్రా కారు మరో సంచలనాన్ని సృష్టించింది. వేగంతోపాటు ఇంధన పొదుపులోనూ తన సామర్థ్యాన్ని నిరూపిస్తూ, 12 గంటల్లో లీటరుకు 29.9 కిలోమీటర్ల అద్భుత మైలేజీ సాధించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుదక్కించుకుంది. దేశంలో ఇదివరకు నమోదైన రికార్డును ఈ కొత్త బద్దలుకొట్టింది.ఇండోర్‌లోని నాట్రాక్స్ హైస్పీడ్ ట్రాక్‌పై నవంబర్ 30 ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పిక్సెల్ మోషన్ బృందం నిరంతరంగా ఈ పరీక్ష నిర్వహించింది. డ్రైవర్ మార్చే సమయంలో తప్ప వాహనం ఆగలేదు. ఈ నిరంతర ప్రయాణం మొత్తం మీద సియెర్రా 29.9 కి.మీ మైలేజీ ఇచ్చి కొత్త చరిత్ర సృష్టించింది.ఈ ఘనత వెనుక టాటా అభివృద్ధి చేసిన 1.5 లీటర్ల హైపెరియన్ పెట్రోల్ ఇంజిన్ కీలక పాత్ర పోషించింది. ఇంజిన్ లోపల ఘర్షణను తగ్గించే ప్రత్యేక మండే విధానంతో పాటు, ఎక్కువ టార్క్, మృదువైన నడక, తక్కువ ఇంధన వినియోగం లక్ష్యంగా రూపొందించిన ఈ ఇంజిన్ తన ప్రతిభను నిరూపించింది.సియెర్రా విడుదలైన వెంటనే ఇలాంటి జాతీయ రికార్డు సాధించడం తమకు అత్యంత గర్వకారణమని టాటా మోటార్స్ ప్రయాణ వాహన విభాగ చీఫ్ ప్రొడక్ట్ అధికారి మోహన్ సావ్కర్ తెలిపారు. హైపెరియన్ ఇంజిన్ పెట్రోల్ ఇంజిన్లకు కొత్త ప్రమాణాన్ని తీసుకొచ్చిందని, ఈ రికార్డు దానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఇంధన సామర్థ్యాన్ని ముఖ్యంగా చూసే



వినియోగదారుల కోసం సియెర్రా మరింత ఆకర్షణీయ ఎంపికగా మారిందని ఆటో రంగ నిపుణులు చెబుతున్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

**– రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్**



మనగళం, కర్నూలు సిటీ : కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో వేగవంతమైన, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ స్పష్టం చేశారు. దేవదాయ శాఖ పరిపాలన భవన సముదాయం నిర్మాణానికి సుమారు రూ.5 కోట్ల నిధులు కేటాయించి పనులను పూర్తి చేయించి ప్రారంభించామన్నారు. గత ప్రభుత్వ కాలంలో కేవలం పునాది వేసి పిల్లర్ స్థాయిలోనే నిలిచిపోయిన నిర్మాణాలను, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు మంజూరు చేసి పూర్తి చేసి ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నామని మంత్రి టీజీ పేర్కొన్నారు. దేవాదాయ శాఖ మంత్రివర్యులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆనం రామ నారాయణరెడ్డి పరిపాలనలో సుదీర్ఘ అనుభవం కలిగిన నాయకుడని , అన్ని శాఖలపై అవగాహనతో వ్యవహరించే వ్యక్తి దేవాదాయ శాఖ మంత్రిగా ఉండటం రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తుందని మంత్రి టి.జి. భరత్ ప్రశంసించారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ శాఖకు సంబంధించిన సుమారు నాలుగు లక్షల ఎకరాల భూమి ఉందని, వాటిని క్రమబద్ధీకరించి సమర్థవంతంగా వినియోగించడంతో పాటు టూరిజం అభివృద్ధి, చారిత్రక ప్రాధాన్యత కలిగిన దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ చర్యల ద్వారా భక్తుల సౌకర్యాలు మెరుగుపడడమే కాకుండా స్థానికము గా ఆర్థికాభివృద్ధి కూడా జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. అనంతపురం నుంచి కర్నూలు జిల్లా వరకు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి, లేపాక్షి ప్రాంతంలో డిఫెన్స్, స్పేస్, స్టీల్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక కారిడార్‌ల అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా నిరంతరం పని చేస్తోందని మంత్రి టి.జి. భరత్ అన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే దేవదాయ శాఖకు సంబంధించిన ధార్మిక భవనం పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తయిందని తెలిపారు. రాయలసీమకు తలమానికంగా నిలిచే విధంగా ఈ నూతన కార్యాలయాన్ని అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. దేవదాయ శాఖ అభివృద్ధి, ఆలయాల పరిరక్షణ, సంప్రదాయాల కొనసాగింపే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని, ఈ నూతన ధార్మిక భవనం రాయలసీమ ప్రాంత ప్రజలకు, ఆలయాల పరిపాలనకు ఒక మైలురాయిగా నిలుస్తుందని గౌరు చరితా రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ హరి జవహార్ లాల్, కమిషనర్ రామచంద్ర మోహన్, రీజనల్ జాయింట్ కమిషనర్ ఆజాద్, డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్, సూపరిండెంట్ ఇంజనీర్ సతీష్, అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, మద్దిలేటి స్వామి ఈవో రామాంజనేయులు, మహానంది, ఉరుకుందు ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ సిటీగా మారనున్న కర్నూలు

**– మాజీ ఎంపీ టీజీ వెంకటేష్**



మనగళం, కర్నూలు సిటీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే కర్నూలు నగరం మెడికల్ సిటీగా మారబోతోందని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. కర్నూలులో ఏర్పాటవుతున్న ఆసుపత్రులను చూస్తే ఎవరికైనా ఈ అభిప్రాయం కలుగుతుందన్నారు. స్థానిక బుధవారపేటలో నూతనంగా నిర్మించిన బ్రెయిన్ అండ్ స్పైన్ సెంటర్ ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ వైద్య సేవల రంగంలో కర్నూలు నగరం అగ్రగామిగా మారుతోందని అన్నారు. రాయలసీమతో పాటు, పొరుగున ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుండి నిత్యం వేలాది రోగులు చికిత్స కోసం కర్నూలుకు వస్తుంటారని, కర్నూలుకు వెళ్తే ఎంతటి జబ్బుకైనా చికిత్స లభిస్తుందనే అభిప్రాయం ప్రజల్లో ఉందని ఆయన అన్నారు. యువ వైద్యుల సారథ్యంలో ప్రారంభించిన బ్రెయిన్ అండ్ స్పైన్ సెంటర్ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలోని పెద్ద నగరాల్లో లభించే వైద్య సౌకర్యాలన్నీ కర్నూలులో లభిస్తున్నాయని అన్నారు. న్యూరాలజిస్టులు డా. హేమంత్ కుమార్, డా. రాఘవేంద్ర మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో రాయలసీమలో ఎక్కడా లేని అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డా. డబ్ల్యూ సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహంలో లక్ష్మీకాంత రెడ్డి పుట్టినరోజు వేడుకలు



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : వైసీపీ నేత, 26వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంతా రెడ్డి పుట్టినరోజు వేడుకలు నగరంలో పంప్ హౌస్ ఎదురుగా ఉన్న మా పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో జరిగాయి. నిరాశ్రయుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. అదేవిధంగా వసతి గృహంలోని వారికీ వంటకు కావలసిన నిత్యావసర సరుకులు, స్నానం, బట్టల సోపులు అందజేశారు. వసతి గృహనిర్వాకురాలు రాయలసీమ శకుంతల మాట్లాడుతూ పుట్టినరోజు పేరిట చాలా డబ్బులు ఖర్చు పెట్టి పార్టీలు చేసుకుంటారని, అయితే లక్ష్మీకాంతా రెడ్డి ఇక్కడి వారి కడుపు నింపడం సంతోషకరమన్నారు. లక్ష్మీకాంతా రెడ్డికి మావసతి గృహం తరపున మరొకసారి జన్మదిన శుభాకాంక్షలు అన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, కళావతి, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# భక్తులకు సౌకర్యాలను మెరుగుపర్చాలి

**– దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**



మనగళం, కర్నూలు సిటీ : దేవాదాయ శాఖకు ప్రామాణిక నిర్వహణ విధానాలు వేదమంత్రాలతో సమానమని, ఆ మేరకు దేవాలయాలను నిర్వహించి శాఖ అభివృద్ధికి కృషి చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కర్నూలు లో డిప్యూటీ కమిషనర్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం కర్నూలు, నంద్యాల జిల్లాల దేవాదాయ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భక్తుల నుండి ఫిర్యాదులు రాకుండా దేవాలయాల్లో సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు అర్చకులకు,వేదపండితులకు, ధూప, దీప, నైవేద్యాలకు, మరమ్మత్తులకు ప్రభుత్వం ఖర్చు చేస్తున్న విధానాలపై ప్రజల నుండి హర్షం వ్యక్తం అవుతోందన్నారు. దేవాలయ పునర్నిర్మాణ పనులు, అసంపూర్ణంగా మిగిలిపోయిన నిర్మాణాల మరమ్మత్తులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దేవాలయాల ఆదాయ వనరులను,ఆస్తులను పరిరక్షించే చర్యలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. దేవాలయ ప్రాంగణాలలో చెట్లను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని, పారిశుద్ధ్య చర్యల్లో లోపాలు లేకుండా సమర్థవంతంగా చేయాలని మంత్రి ఆదేశించారు. శ్రీవాణి నిధుల ద్వారా దేవాలయాల నిర్మాణం కోసం తగిన ప్రతిపాదనలు పంపాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, కమిషనర్ రామచంద్ర మోహన్ మాట్లాడుతూ దేవాలయాల్లో భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, సేవలు, ప్రసాదంలో నాణ్యత, పారిశుద్యం తదితర అంశాల్లో ప్రజల నుండి సానుకూల స్పందన వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని, పండుగ రోజుకు, విశిష్ట దినాలలో దేవాలయాలను చక్కగా అలంకరించాలని సూచించారు. సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ హరి జవహార్ లాల్, కమిషనర్ రామచంద్ర మోహన్, రీజనల్ జాయింట్ కమిషనర్ ఆజాద్, డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్, సూపరిండెంట్ ఇంజనీర్ సతీష్, అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, మద్దిలేటి స్వామి ఈవో రామాంజనేయులు, మహానంది, ఉరుకుందు ఈరన్న తదితర దేవాలయాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు,ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఏపీకే ఫైల్స్ తో జాగ్రత్త

**– ఏపీకే ఫైల్స్ లింకులను తొందరపడి క్లిక్ చేయకండి – జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**

మనగళం, కర్నూలు క్రైం : సైబర్ నేరాలు ఎక్కువ అవుతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. ప్రభుత్వ పథకాల పేర్లతో నకిలీ ఏపీకే ఫైల్స్ వాట్సాప్ గ్రూపులు, ఎస్ఎమ్ఎస్, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయని అప్రమత్తతే రక్షణ అన్నారు. డౌన్ లోడ్, ఇన్ స్టాల్ చేయకండి.... మీ వ్యక్తిగత, బ్యాంక్ ఖాతా వివరాలు దొంగిలించబడతాయని హెచ్చరించారు. నకిలి ఏపీకే ఫైల్స్ ను క్లిక్ చేస్తే సైబర్ నేరగాళ్ళ చేతిలో మోసపోతారు. మీ ఖాతాల్లోని డబ్బులు దోచేస్తారన్నారు. ఈ చలాన్ పేరుతో వచ్చే మెసెజ్ లు, సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముందుగా ఏపీకే ఫైల్ ను పంపుతారు. నమ్మదగిన వాట్సాప్ గ్రూపులలో షేర్ చేస్తారు. ఆ గ్రూపులో ఉన్న సభ్యులు దానిని నమ్మి ఆలోచించకుండా ఏపీకే ఫైల్ ను క్లిక్ చేసి ఇన్స్టాల్ చేస్తారు. వెంటనే ...మీ అనుమతి లేకుండా క్రెడిట్ కార్డు నుంచి ఆన్లైన్లో కొనుగోళ్లు జరిగినట్లు మెసేజ్లు వస్తాయని హెచ్చరించారు. ఏపీకే ఫైల్ ను మీరు ఇన్స్టాల్ చేస్తే మీ ఎస్ఎమ్ ఎస్ లను యాక్సెస్ చేయగలదు(ఓటీపీలను తెలుసుకోవచ్చు). మీ బ్యాంక్ అకౌంట్, క్రెడిట్ కార్డు వివరాలను తెలుసుకోవచ్చు. మీ ఫోన్ ను ఓ రిమోట్ మాదిరి సైబర్ నేరగాళ్లు నియంత్రించగలరని ఎస్పీ వివరించారు. గుర్తు తెలియని, అనధికార లింక్ లను క్లిక్ చేయకండి. ఏపీకే ఫైల్స్ డౌన్లోడ్ చేయకండి. వాట్సప్ యాప్ గ్రూపుల్లో షేర్ చేస్తే వచ్చే మెసేజ్లను గుడ్డిగా నమ్మకండి. నేరగాళ్లు వాటిని అధికారికంగా ఉన్నట్లే మాయ చేసి వాటిని అలా పెడతారు. యాప్స్ ను ఎల్లప్పుడు గూగుల్ ప్లే స్టోర్ నుంచే డౌన్లోడ్ చేయండి. ఓటీపీ అలర్ట్స్ ను ఎనేబుల్ చేసుకోండి. ఏవైనా మీ అనుమతి




లేకుండా లావాదేవీలు జరిగినట్లు అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే కార్డును బ్లాక్ చేయండి. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 కి కాల్ చేయాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.